కవిత్వం

# అమోహం

శ్రీసుధ మోదుగు



**AMOHAM**
Poetry

by
Srisudha Modugu
sudhamodugu@gmail.com

© Poet

Cover Design
Ramana jeevi

Published on : December 2017

Price : **100/-**

For Copies
Modugu Lakshma Reddy
Retd. Head Master
Modugu vaari Veedhi
Rentachintala - 522 421
Guntur Dist., A.P.

P.M. Rao
8-20-37/A, 3rd Line,
Sitarama Nagar, Guntur., A.P.
Ph : 77940 04466

K. Rami Reddy
8-124-4/6 Sundharaiah Bhavan Street,
Kothapet, Kanigiri - 523 230, A.P.
Ph : 94903 30841

DTP
Ravipati Parameswar

Layout
Lakshmi Prasanna Graphics
Guntur, Cell : 98660 16690

Printed
Himalaya Graphics
RTC Cross Roads, Hyderabad
Ph : 040-65552357



ఆవిరి నులివెచ్చగా గాలిలో కలిసి
మెల్లగా తాకుతుంది
సూర్యుడు కంట్లో మెరిసి మురిసిన
సమయాలకు పట్టుబడతాం

అందమైనకల మేఘావృతమై
అసంపూర్ణచిత్రంలా తోస్తుంది
ఇసుకగూళ్ళకు హరివిల్లులతో రంగులద్దుతాం
మంచుతెర కనుపాపలో ఇంకిపోతుంది

నిశ్శబ్ద ప్రవాహాలు
క్షణాల ఏకాంతాలు
ఏదీ పట్టని నిశ్చలత్వం

పూచే పూల ఆనందం
ఎగిరే సీతాకోకల స్వేచ్ఛ
ఆకాశమంతా నిండివుంది

మరింకేమి కావాలి
నీకైనా నాకైనా

ఎప్పటికప్పుడు
నీకు చెప్పాలనే అనుకుంటా

చేతుల్లో పూసిన పూలు నీకై వున్నాయని
నన్ను చూసుకొని
నువ్వనుకొని వెలుగవుతానని
నిర్మింపబడినదంతా ఒక ఎత్తు
నీవు మాత్రం వేరని

పిచ్చుకలు గూడుని కట్టినంత
శ్రద్ధగా రాసుకుంటాను
పూలు, ఆకులు, ఆకాశం, సముద్రం
సూర్యుడు, చంద్రుడు
నక్షత్రాలు, వెలుగూ చీకటి, పక్షులగూళ్ళు అని

కలలో నీ నవ్వులు
పచ్చని చామంతులు
ఎప్పటికీ వసివాడని విషయాలు నా జీవితాన

సూర్యుడా!
నీ వెచ్చని వెలుగే
నా జీవం కదా!

కొన్ని సమయాలు ప్రత్యేకమైనవి
సముద్రం నీలో, నీ చుట్టూ అంతు చిక్కదు
పెదవులపై ఋతువులు మారిపోతాయి
చేతుల్లోంచి దయ నీలాగే ప్రవహిస్తుంది

నీ గురించి ఆలోచిస్తా
ఎప్పటిలా నాలోపల మెదిలే నీతో కాకుండా
ప్రత్యేకంగా నీ ఎదురుగా వచ్చి

అనిపిస్తుంది, అన్నీ నీకు తెలిసిపోతున్నాయని
వెంటనే అభద్రత నన్ను చెట్టెక్కిస్తుంది
భయంగా కిందకి తొంగిచూస్తాను

నీవు మాత్రం ఎప్పటిలా గులకరాళ్ళతో
ఏటిగట్టుపై కూర్చొని
ఒక్కొక్కటీ విసురుతూ ఏమీ ఎరగనట్టు అంటావు
"చూడు! చిన్నరాయి ఎన్ని వలయాలు చేస్తుందో" అని

మెల్లగా దిగి వచ్చి పక్కన కూర్చుంటాను
నా భుజాలను నీ చేతితో చుట్టి, లాలనగా అంటావు

'నేనిక్కడే ఉన్నాను
ఏటికోసం, రాళ్లకోసం, ఆడుకోవడం కోసం' అని

ఇక, భయం ఎందుకో అర్థం కాదు.

నీ చేతివేళ్ళని గట్టిగా పట్టుకొని
చెప్పవలసిందంతా చెప్పేద్దామనుకుంటా

ప్రత్యేకించి నీతో ఇలా గడపడం మాత్రం
మౌనం కంటే అద్భుతంగా ఉంటుంది.

ధ్యాసలో ధ్యానంలా దోసిట్లో నువ్వు
నెమ్మదిగా నాలోకి జారడం
నేను మళ్ళీ మామూలవ్వడం
దైనందిన జీవనచర్యగా భావిస్తా

ఎందుకు, ఎలా అనే ప్రశ్నలకు
సమాధానం తోచదు
తెలిసినపేర్లను, లక్షణాలను వెతికిచూసి
పసలేని వాదాలతో నన్ను నేనే ఓడించుకుంటా.

నువ్వో ప్రపంచం అందరికీ
నీ ప్రపంచం వేరే ఉంటుంది

మాటల్లోనో, పాటల్లోనో ఓ మృదుకంపనమై
నీ స్పర్శ తడుతూనే ఉంటుంది.
ఆలోచన తరంగాల రూపమెత్తి
హృదయం చుట్టూ
ఉజ్జ్వల కాంతి వలయమవుతుంది.

అవును! కలలు నిజాలు కావు
నిజాలు అబద్ధాలు కావు.
సమాంతరఛాయలా
నాతో నడుస్తున్న నీడలేని రూపం
బహుశా నీదే కావచ్చు.

ఉన్నట్టుండి ఒక్క పెట్టున వానై
వర్షించడమే తెలుసని మిన్నకున్నా

తడవకుండానే తడుస్తున్న
హమ్మింగ్ పక్షి మాత్రం
నవ్వుతూ పాటను పాడుతూ వెళ్ళిపోయింది

Oh, My dear beautiful angel
This is called Life.

## మనసు

కొంచెం కొంచెంగా ఖాళీ అవుతుంది

ఏ చింతాలేక పారుతున్న నదిని
ధాన్యంకై వెతుకుతున్న పిట్టల్ని చూస్తూ
నీ మాటల్ని మననం చేసుకొని
చిన్నగా కళ్లు చెదరకుండా నవ్వుకోవడం
నెమ్మదిగా అలవాటవుతుంది

బహుశా రావద్దనుకున్నావేమో
కప్పు వణికి, కాఫీ ఒలికి చేయి కాలింది
నాలుక కొరుక్కున్నప్పుడల్లా
గాయాలెలా అవుతున్నది అర్థమవుతుంది

నిజమే, నిలిచిపోయేవారెవ్వరూ లేరు
కళ్ళముందు నుంచి ఒక్కొక్కరూ మాయమవుతారు
కలలోంచి మెల్లిగా నడుచుకుంటూ
నన్ను దాటుకుంటూ
వాళ్ళు, నువ్వూ అందరూ
అచ్చంగా అప్పగింతలలో వదిలేసినంత
ఉదారంగా వెళ్లిపోతారు

ఉగ్గబట్టుకున్నదేదో గొంతులో ఆగిపోయినా
కొంచెం ఊపిరి కోసమైనా బతకాలి
ఎక్కడో ఒక చోట
ఎంతో కొంత తవ్వుకొని, నింపుకొని, ఒంపుకొని.

వాళ్ళ కోసమో, నీకోసమో
ఎప్పుడో  ఓసారి అన్నిచోట్లా వెతుకుతావు

రాయాల్సి వచ్చినా
రాయలేనప్పుడు తెలుస్తుంది
చేతివేళ్లు దుఃఖంతో కరుడు గట్టిన సంగతి

వాళ్ళు, నీలోంచి వెళ్ళినప్పుడో లేక
నువ్వే
వాళ్లను వదిలి వెళ్లిపోయినప్పుడో
జీవించేందుకు ఇంకా మిగిలిందేమిటనుకుంటావు

ప్రయత్నించి, పోరాడి
ఓరాత్రి తేల్చుకుంటావు
నువ్వు నిలుచున్న చోటు మాత్రమే
అప్పటికి నీదని.

వెళ్ళిపోతారు
నీవైపు ఒక్కసారైనా తిరిగి చూడకుండా
ఏమీ ఆలోచించకుండా
కనీసం ఓ మాటైనా చెప్పకుండా

అస్తవ్యస్తంగా అన్నీ కుప్పలుగా పోసి
అంతు చిక్కని విరామమని అనుకుంటావు

తీరం వెంట నువ్వూ, వెలుగు
వంతులవారీగా ఎదురుచూడటం
జీవితంలో భాగమవుతుంది

ప్రశ్నించడం, ప్రయత్నించడం
విచారణ లేకపోవడం
ఉత్తమమైన ఒప్పందంగా రాసుకుంటాం

ఆకాశాన్ని ఈదడం
సముద్రాన్ని ఒంపుకోవడం
తేలికేమి కాదు

అపరిచిత ప్రపంచంలో
అప్రయత్నంగా పడే అడుగులకి
దుఃఖమూ లేదు, శాంతీ లేదు

ఓడలకి
తీరాలు స్థావరాలు కావెప్పుడు

సముద్రం అనంతానికి
ఓడలు సముద్రానికి
ఆకాశం అహంకారానికి
మనం మనకి చెందివుంటాము

ఈకల మధ్యలో కత్తులు ఉంటాయి
రెక్కలనవి గాయపరుస్తాయి
అయినా, రక్తంకారే హృదయాలు వెలుగుతూనే వుంటాయి

నిన్ను నువ్వు తెలుసుకొనే క్రమంలో
నిస్సందేహంగా నిలబడాల్సిన
నిరామయ, నిరాశ్రిత కాలగమనంలో
ఏదీ అంత ముఖ్యంకాదు

మనం అన్న మనుగడ తప్ప.

భరించలేనంత నొప్పిగా ఉంటుంది

ఎదురుగా వచ్చి
నిర్దయగా ఛాతిలో బల్లెం దించి
గుండెను పెకలించి తీసుకుపోయినట్లు

దుఃఖాన్ని మించినది
ఏముంటుందని వెతుకుతాను.
సర్దిచెప్పుకోలేక
ఆ క్షణం జీవితమే కాదనుకుంటాను

ఒక రోజు నేనూ పక్షినై ఎగరాలని ఆశపడతా
బంధాలను వదిలించుకొని
నాకోసం నేను పసిపిల్లనై పరుగులుతీస్తా

అడవి మొత్తం అడ్డదిడ్డంగా పెరిగిన తీగలు
కాళ్ళకి చుట్టుకుంటాయి
పరీక్షలకు ఏమీ మిగలదు
మిగుల్చుకోడానికి మనసు రాదు

తప్పించుకొనే దారిలేక
నడిసముద్రంలో ఓ పసినావ
సముద్రాన్ని ఆబగా మింగేస్తుంది.

విషాదం ఎక్కడినుంచైనా వస్తుంది
ప్రయత్నమేమీ ఉండదు

ఊరకే ప్రపంచాన్ని చూస్తున్నప్పుడు కూడా
కళ్ళు తడవుతాయి

అరచేతుల్ని తీసుకుపోయారు
ప్రమాణాలేవి అని అడక్కు.
కాళ్లను నరుక్కుపోయారు
మోయడం తప్ప నీకు మార్గమేమీ లేదు

నేనేదైనా ఇవ్వగలనా అని ఆలోచించాను

ఎడారి మధ్యలో
కనుచూపుమేరా ఇసక మాత్రమే ఉంది.

చీకటి కోసం ఎదురు చూద్దాం

భయపడకు
దీపం వెలిగించను

కొన్ని క్షణాలను
మంచుముద్దల్ని చేసి ఆడుకుందాం

పగిలిన క్రింది పెదవిని
నొప్పిలేకుండా
ఓ చిన్నముద్దుతో తడిచేయనివ్వు

నిన్నేమీ అననులే
దోసిట్లో కొన్ని నీళ్లు తెచ్చాను
గొంతు తడుపుకొని
కాస్తంత తేటగా నవ్వరాదూ

రాలిపడ్డ ఉల్కలకై
తప్పిపోయిన మనుషులకై
కంటి చీకటిని పరిహసించే కనుపాపలకై

విరిగిపోయి

వీగిపోయి

విచ్ఛిన్నమవ్వడమేల

మనకి మిగిలింది

ఈ కొంచెం సాయంత్రమే కదా !

చుక్కలు పొడిచే వేళైంది

చిన్నగడ్డి మొలకెత్తిన

ఓ పచ్చని నేలన

కాసేపు అలుపు తీర్చుకున్నా

కదలాలని ఎంతో ప్రయత్నించా

అడుగు ముందుకుపడటం కూడా కష్టమైంది

ఎలుగెత్తి పిలిచా

మనుషులతో కిక్కిరిసిన లోకం

వినడానికి ఒక్కరూ లేరు

పక్కన నువ్వు కూడా

చివరి ప్రయత్నంగా

నిన్ను గుండెల్లో పెట్టుకొని సాగాలనుకున్నా.

కళ్ళేమో అలసటగా వెతుకుతుంటాయి
కనపడే సత్యంలో నువ్వు లేవు
అనుకునే యథార్థంలో నేను లేను

గుప్తంగా లోపలెంత గట్టిగా దాచుకున్నా
వెళ్తాను అన్నప్పుడు
సాదరంగా పంపడమే ఆంక్షారహితం

పయనమంటూ మొదలైతే
కాలాల షరతులకు
ఎదురునిలిచే ధీరత్వం
ఎవరికీ వుండదు

గుర్తుంచుకో
సూర్యుడు అస్తమించే కాలం
ఎప్పుడూ మనోహరమే.

ఎవరితో ఎందుకు మాట్లాడాలనిపిస్తుందో
పాడాలనిపిస్తుందో
నవ్వాలనిపిస్తుందో
నడవాలనిపిస్తుందో అర్థం కాదు.

మెత్తటిచేతుల స్వార్థంతో
అక్కున చేర్చుకోవాలనుకున్నా
హక్కల్లా అనుభూతుల్ని పొందడం వరకేనని

కాలాలు తుడిచి దూరాలు చెరిపి
వసంతమై ఎదురుకాలేనని
తెలుస్తున్నప్పుడు అర్థమైపోతుంది

మనం దేనికీ మినహాయింపు కాదని.

గాలిని తాకటానికి
అనుమతి కావాలని తెలియనప్పుడు
కారణాలకు దొరకనిదేదైనా ఉందేమో అని చూస్తావు

క్షమించలేని నిర్దయకాలం
వెలివేసి
భూమికి ఆవల విసిరేసింది

కలలు పూలై, పూలు మాటలై
సాయంత్రంలో మార్వారాగం ఆలపించే
హమ్మింగ్ పక్షి సమయం
నిర్ణయించబడే ఉంటుంది

ఫలించాల్సిన కోర్కెలు
ఫలించకుండానే ముగిసిపోతాయి.

ఇక నిష్కామంలో
నిమిత్తమాత్రంగా మిగలటమే
మిగిలిన మన పని.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Amoham**

* * *